మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

### కలెక్టర్ తక్షణ స్పందన..

# వృద్ధురాలికి స్వాంతన



వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు11 ప్రభాతవార్త :** "కొడుకు కోడలు ఉన్నా.... నిరాదరణకు గురై నడవలేని స్థితిలో ఓ వృద్ధురాలు తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరడానికి కలెక్టరేట్‌కు వచ్చి పడుతున్న ఇబ్బందిని కళ్ళారా చూసిన జిల్లా పాలనాధికారిని తక్షణం స్పందించారు. వృద్ధురాలి దీనస్థితిని విని పాలనాధికారి చలించారు. వృద్ధురాలి బాగోగులు చూడని ఆమె కొడుకుపై చర్యకు ఉపక్రమించారు." సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అయితే నారాయణ పేట పట్టణానికి చెందిన రుక్మిణి (54) అనే వృద్ధురాలు నడవలేని స్థితిలో తన ఇద్దరు కూతుర్ల సాయంతో కలెక్టరేట్ మెట్లు ఎక్కడానికి ఎంతో ప్రయాసపడుతోంది. ఉదయం మద్దూరు సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసి అప్పుడే కలెక్టరేట్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తన వాహనంలో నుంచే వృద్ధురాలు రుక్మిణి మెట్లు ఎక్కడానికి పడుతున్న ఇబ్బందిని చూసి వెంటనే తన వాహనం దిగి నేరుగా స్వయంగా తానే రుక్మిణి వద్దకు వెళ్ళి ఆమె సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. తన కొడుకు, కోడలు తనను చూసుకోవడం లేదని,చనిపోయిన తనభర్త ఉద్యోగం పొందిన కొడుకు తనకు తిండి పెట్టడంలేదని, కోడలు సైతం సూటి పోటీ మాట్లాడుతోందని, తన కొడుకు తన పెద్ద కూతురు వద్ద అత్తగారింటిలో వదిలి వెళ్ళాడని, ఎలాగైనా తనకు న్యాయం చేసి ఆదుకోవాలని వృద్ధురాలు రుక్మిణి కలెక్టర్‌తో మొర పెట్టుకుంది. వెంటనే స్పందించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్ వృద్ధురాలి కోసం వీల్ చైర్ తెప్పించి తక్షణ రక్షణ కోసం పట్టణంలోని సఖీ కేంద్రంలో రుక్మిణిని చేర్పించి, రుక్మిణి కొడుకుపై తగిన చర్య తీసుకునేందుకు ఆర్డీఓ రామచందర్‌ను విచారణకు ఆదేశించింది.

### ప్రజావాణి ఫిర్యాదులపై

# ప్రత్యేక దృష్టి పెట్టండి

**జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

**వనపర్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 45 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు రేషన్ కార్డులు,

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**బాలానగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం మండలానికి చెంన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి పేదల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదలకు గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందన్నారు. నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అందించకుండా ప్రభుత్వ భూములను దోచుకుందన్నారు. ప్రజలను, ప్రభుత్వ భూములను దోచుకోవడం తప్ప ప్రజలకు సంక్షేమ పథకాలు అందించలేదని విమర్శించారు. పెద్దాయపల్లిలో రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మరియు జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని మహిళలు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి రాఖీ కట్టిన సందర్భంగా ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. నాకు నియోజకవర్గంలో మహిళలందరూ అక్కాచెల్లెలని, వారికి ఏ ఆపద వచ్చిన సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ లిఖిత రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అశ్విని రాజేశ్వర్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు తిరుపతి, వెంకట్ రెడ్డి, దత్తాత్రేయ, హరిసింగ్, యాదయ్య, మోహన్ నాయక్ పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 43 ఫిర్యాదులు



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్ ఆగస్టు 11, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మీ మ్నారాయణ, నర్సింగ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీల ను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పట్టణాలు, గ్రామాల

# అభివృద్ధికి బాటలు

- రాష్ట్ర ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉంది
- అచ్చంపేటలో నూతన మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు,గనులు,శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట్ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకట్ స్వామి



మున్సిపల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వివేక్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగారాలు, గనులు, శాఖలమంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట్ స్వామి అన్నారు.పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, పట్టణాలు గ్రామాల అభివృద్ధికి బాటలు వేసేలా కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. నాగర్ కర్నూల్‌జిల్లా అచ్చంపేట పట్టణంలో రూ.3 కోట్ల నిధులతో అత్యధిక అంగులతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణలు, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లతో కలిసి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖల మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని అత్యంత సుందరమైన భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఇలాంటి మున్సిపాలిటీ భవనాన్ని ఎక్కడ చూడలేదని మంత్రి తెలిపారు. ఇంతటి గొప్ప భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ నిర్మాణానికి ప్రత్యేక కృషి చేయడంతోనే భవనం సుందరంగా రూపుదిద్దుకుందని మంత్రి ఎమ్మెల్యేను అభినందించారు. మున్సిపాలిటీ పరిధిలో చెత్త సకాలంలో తొలగింపు, కాలువల శుభ్రత, తాగునీటి సరఫరాలో వ్యత్యాసాలు లేకుండా చూసేలా సంబంధిత శాఖల అధికారులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి నివాసానికి శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువలు, డ్రైనేజీలు క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, ఇబ్బందులు ఎదురవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిత్య పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన మున్సిపల్ కౌన్సిలర్లకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం -మిగతా4లో..



మృతి చెందిన గొర్రెలు

## కుక్కల దాడిలో 60 గొర్రెపిల్లల మృతి

**ఊట్కూర్,ఆగస్టు11 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధి ఓబ్లపూర్ గ్రామంలో కుక్కల దాడిలో 60గొర్రెపిల్లలు మృతి చెందాయి. మధ్యా హ్నం 3:56 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు దండలి బాలరాజ్ తండ్రి ,పోలప్ప, బెళగుం ది మాలప్ప తండ్రి ,చిన్న తయప్ప, మహేష్ జంబపొల్ల, తండ్రి మల్లప్ప, తమ గొర్రెపిల్లలను పాకలో ఉంచి, పెద్ద గొర్రెలను మేపుకు తీసుకెళ్లారు. ఈ సమయంలో ఎవరు లేని పరిస్థితిని ఆసరాగా తీసుకున్న విధి కుక్కలు పాకలోకి చేరి,గొర్రెపిల్లలపై దాడి చేశాయి.ఈ దాడిలో ముగ్గురు కాపరుల గొర్రెపిల్లలు మృతి చెందగా, రైతులు సుమారు 3-4లక్షల రూపాయల ఆర్థిక నష్టాన్ని చవిచూశారు. విష యం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి పశువైద్య సిబ్బంది ఆంజనేయులు,జె. శివ ప్రసాద్ ఎల్.యస్.ఎ.లు చేరుకుని,గాయపడిన గొర్రెలకు చికిత్స అందించారు.గ్రామస్తులు ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధితులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## తాజాగా, వేడిగా వడ్డించాలి

**- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి - ప్రజావాణికి 76ఫిర్యాదులు**



ఆహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు11, ప్రభాత వార్త:** విద్యార్థులకు అందించే ఆహారం మెనూ ప్రకారం వేడిగా, తాజా కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మెట్టుగట్ట వద్ద ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల కళాశాల (పిల్లలమర్రి రోడ్) జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న ఇద్దరు విద్యార్థులతో ముచ్చటిస్తూ ఎలా చదువుతున్నారు? ఏం చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు బాగానే చెబుతున్నారా అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్, స్టోర్ రూమ్, లైబ్రరీని పరిశీలించిన అనంతరం వంటగదికి వెళ్ళి అక్కడ మధ్యాహ్నం మిగిలిపోయిన అన్నం, కూరగాయలు చూసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిపోయేంత ఆహారం మాత్రమే వండి వేడి ఆహారం మాత్రమే వారికి అందించాలని. ఎక్కువ మొత్తంలో ఆహారం వండకూడదని ఆదేశించారు. మీ ఇంట్లో అయితే ఇలానే పెట్టుకుంటారా అని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నూతన సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలి..**

నూతన స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు పై శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు వృద్ధ సంఘాలు దివ్యాంగుల సంఘాలు కిశోర బాలిక సంఘాలను ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలపై పడిన వారు, దివ్యాంగులు, కిశోర బాలికలను గుర్తించి అందరూ సంఘాలలో చేరేలా వారిని ప్రోత్సహించాలని. వారికి బ్యాంకు ఖాతాలు తెరిపించాలని, బ్యాంకు లింకేజీ చేయాలన్నారు. ఈ నెల ఆఖరి నాటికి సంఘాలలో చేరేలా చూడాలని అన్నారు.

**ప్రజావాణికి 76 ఫిర్యాదులు..**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం -మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

### నిర్వాసితులకు ప్రభుత్వం

# అండగా ఉంటుంది

**రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** కొల్లాపూర్ మండల పరిధిలో ఉన్న నార్లాపూర్ రిజర్వాయర్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద ముగింపుకు గురవుతున్న గ్రామాల నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు తోడు ఉంటుందని రాష్ట్రఎక్సైజ్ పర్యాటక సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కొల్లాపూర్ మంత్రి క్యాంపు కార్యాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, రెవెన్యూ, సాగునీటిపారుదల అధికారులు ముంపుకు గురవుతున్న గ్రామాల నిర్వాసితులతో పునరావాసం, ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణాలు, తదితర అంశాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్వాసితుల పునరావాసమే మా ప్రథమ ప్రాధాన్యత, ప్రభుత్వం వారి జీవితంలో కొత్త వెలుగులతో -మిగతా4లో..

### సీజనల్ వ్యాధుల పట్ల

# అప్రమత్తంగా ఉండాలి

**రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్**



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

**మద్దూర్,ఆగస్టు11 ప్రభాతవార్త:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం మద్దూరు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆస్పత్రికి వచ్చే ఔట్ పేషంట్ల వివరాలను రిసెప్షన్‌లో రిజిస్టర్‌ను చూసి తెలుసుకున్నారు.చిన్నపిల్లల వార్డుకు వెళ్ళి రోజుకు ఎంత మంది చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చిన్న పిల్లల వైద్య నిపుణుడు క్రాంతి కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న 30 పడకల కంటే అధికంగా మరి కొన్ని పడకలతో చికిత్స అందించాల్సిన అవసరం ఉందని ఆర్ఎంఓ పావని,వైద్యుడు క్రాంతి కిరణ్ కలెక్టర్‌కు తెలపగా, స్పందించిన కలెక్టర్ పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 5 పడకలను వినియోగించుకోవాలని సూచించారు. ఆస్పత్రికి అవసరమైన స్టాఫ్, ఇతర వైద్య పరికరాల జాబితా ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, త్వరలో మంజూరు అయ్యే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. ఎక్కువగా చిన్న పిల్లల కు జ్వరాలు వస్తున్నాయని, వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆమె ఆదేశించారు. అయితే ఆస్పత్రికి సంబంధించి విద్యుత్ సరఫరాలో కొంత ఆటంకం ఏర్పడుతోందని ఆర్ఎంవో తెలపగా వెంటనే మరమ్మతు చేయించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రికి జనరేటర్ కూడా మంజూరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఒకరిద్దరు రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ మద్దూరు మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకుల బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఆపాఠశాలలోని 8వ తరగతిగదికి వెళ్ళి అల్పాహారం ఏం ఇచ్చారని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత పాఠశాల వంటగది కి వెళ్ళి మెనూ బోర్డును పరిశీలించారు. మెనూను క్రమం తప్పకుండా అమలు చేయాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. మెస్ కమిటీ విద్యార్థినులతో మాట్లాడారు. రోజు భోజనం ఎలా ఉంటుందని,అందరూ అల్పాహారం భోజనానికి - మిగతా2లో..

# జడ్చర్లను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- శ్రీ రంగనాయక స్వామి, పరుశవేది ఆలయంలో ప్రత్యేక పూజలు
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**జడ్చర్ల,ఆగస్టు 11, ప్రభాతవార్త :** జడ్చర్లను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పంతో భక్తి, సేవ, అభివృద్ధి అనే మూడు మార్గాల్లో ముందుకు సాగుతున్నట్లు శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా జడ్చర్ల కేంద్రంలోని ప్రాచీన శ్రీ రంగనాయక స్వామి దేవాలయాన్నిఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. జడ్చర్ల నియోజకవర్గం ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరినట్లు తెలిపారు.జడ్చర్లమండలంలోని మీనాంబరగ్రామంలో ఉన్న ప్రాచీన శ్రీ పరుష వేదిశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా



పెద్ద గుట్టపై ప్రత్యేక పూజలు అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

గాలిగోపురం (ముఖద్వారం) నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**విద్యార్థులకు నులిపురుగుల మాత్రల పంపిణీ**

జడ్చర్ల మండలంలోని గంగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యావ్యవస్థ పైన ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం అభ్యర్థన మేరకు డైనింగ్ హాల్, అదనపు గదుల నిర్మాణం కోసం కృషి చేస్తానని చెప్పారు.ఇప్పటికే జడ్చర్ల నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, నవోదయ పాఠశాల,మంజూరు చేయించామని,అలాగే ట్రిబుల్ ఐటీ కళాశాల కూడా జడ్చర్లసమీపంలో మంజూరుకావడం నియోజకవర్గ ప్రజలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థులు రాఖీ కట్టడం తనకు సంతోషాన్ని కలిగించిందని భావోద్వేగానికి గురయ్యారు. రాబోయే రోజుల్లో గంగా పూర్ గ్రామాన్ని ఒక రోల్ మోడల్‌గా తయారు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత నర్సింహులు,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి, మండల విద్యాధికారి మంజులాదేవి పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## కెనాల్‌కు గండిపడి కొట్టుకుపోయిన వరి నాట్లు

**నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి**

**ఖిల్లా గణపురం. ఆగస్టు 11. ప్రభాతవార్త :** కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా అల్లమాయపల్లి శివారు నుండి కమాలుద్దీన్పూర్ గ్రామానికి వెళుతున్న బ్రాంచ్ కెనాల్ నీళ్లకు ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం నీరు తోడు కావడంతో అల్లమాయపల్లి శివారు లోని కొత్తగా నిర్మిస్తున్న సబ్ స్టేషన్ ప్రాంతంలో బ్రాంచ్ కాలువకు గండిపడి ఇటీవల వేసిన వరి నాట్లు కొట్టుకుపోయాయని ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వరి నాట్లు కొట్టుకుపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని మాజీ సర్పంచ్ శేషయ్య కోరారు. బ్రాంచ్ కెనాల్ పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ కాలువ లైనింగ్ పనులు సరిగ్గా చేయకపోవడంతో కాలువకు గండి పడిందని దీంతో దాదాపు నాలుగైదు ఎకరాలు వరి నాటు కొట్టుకుపోయినట్లు రైతులు చెప్పారు. సోమవారం సాయంత్రం వరకు కూడా ఎవరు గండిపడిన ప్రాంతాన్ని సందర్శించలేదని వెంటనే అధికారులు స్పందించి గండిపడిన కాలువ పనులు మరమ్మత్తులు చేయాలని, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.


కెనాల్ కు గండిపడి వరి నాట్లు కొట్టుకుపోయిన దృశ్యం

## నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం ..

**చిన్నచింతకుంట, ఆగస్టు 11 ప్రభాతవార్త :** చిన్న పిల్లల్లో నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని మండల తహసిల్దార్ ఎల్లన్న అన్నారు. సోమవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినిలకు నులిపురుగుల నివారణకు గాను ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల్లో ఆకలి తగ్గుదల, కడుపునొప్పి, రక్తహీనత, ఎదుగుదల లోపం నులిపురుగుల వల్ల వస్తుందని దీని నివారణ గాను ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని ఆయన తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరం లోపు బాల బాలికలు నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవాలని ఎంఈఓ మురళి కృష్ణ తెలిపారు. మండలంలో 7733 మంది బాలబాలికలు ఉన్నారని వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయిస్తామని ప్రాథమిక ఆరోగ్య వైద్యురాలు శిరీష తెలిపారు. నులిపురుగుల నివారణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ ఎస్ఓ హేమలత, సిఆర్పి విజయసింహ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంఈఓ

## వార్త కథనంతో దిగొచ్చిన అధికారులు

**ప్రజావాణికి అధికారుల హాజరు**

**నవాబుపేట, ఆగస్టు11 ప్రభాతవార్త :** ప్రజావాణికి ముఖ్య శాఖల అధికారుల దుమ్మా అనే శీర్షికన ప్రచురించిన వార్తకథనానికి కలెక్టర్ స్పందించారు. అన్నిశాఖల అధికారులు ప్రజావాణికి హాజరుకావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. దీంతో ప్రజావాణిలో అధికారుల సంఖ్య హాలు నిండిపోయింది. అయితే ఇంకా రెండు మూడు శాఖల అధికారులు తమకు ఏమీ పట్టనట్లుగా ప్రజావాణి కి గైర్హాజర్ అయ్యారు. గత వార 6వ తేదీన ఏనుమనుగండ్ల, నవాబుపేట ను సందర్శించిన జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి అధికారులను వార్తా పేపర్లో వచ్చిన కథనం పై ప్రజావాణికి అధికారుల దుమ్మాపై హెచ్చరించినట్లు సమాచారం. మండల కేంద్రంలో జరిగే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారని సమాచారం. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ప్రజావాణికి అధిక సంఖ్యలో అధికారులు హాజరయ్యారు.


ప్రజావాణికి హాజరైన వివిధ శాఖల అధికారులు

## ప్రజా ప్రభుత్వ పాలనలో హామీలన్నీ అమలు

**టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి**

**దేవరకద్ర, ఆగస్టు11 ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు 80 శాతం 18 నెలలకే అమలుచేసిన ఘనత ప్రజాప్రభుత్వాన్ని దేనని టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కౌకుంట్ల మండల పరిధిలోని రేకులంపల్లి, వెంకటగిరి, పుట్టపల్లి, గ్రామాలలో సమన్వయ కమిటీ నిర్వహించారు. తదనంతరం వెంకటగిరి, రేకులంపల్లి, పుట్టపల్లి, గ్రామాలకు సంబంధించిన సమస్యలు తెలుసు కుని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాము అని మండల నాయకులు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుటకు ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సద్దాం, రేకులంపల్లి, వెంకటగిరి, పుట్టపల్లి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నులి పురుగుల మాత్రల పంపిణీ

**విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య అధికారిణి డా. స్వప్న**

**ఉప్పునుంతల, ఆగస్టు 11 ప్రభాతవార్త :** మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పునుంతల వైద్యాధికారిణి డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక బాలుర పాఠశాలలో ఆ పాఠశాల హెచ్ఎం ఎం శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారిణి డా. స్వప్న మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులి పురుగులు వ్యాప్తిస్తాయని, కలుషిత ఆహారం, ఈగల వాలిన తినుబండారాలు దుమ్ము ,ధూళి పడిన పదార్థాలు తినడం వల్ల వ్యాప్తించే అవకాశాలు ఉంటాయని అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో వైద్యా ధికారిణి డా. స్వప్నతో పాటు హెల్త్ సూపర్వైజర్ ప్రభావతి, ఆ పాఠశాల హెచ్ఎం ఎం శ్రీనివా సులు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏ.ఎన్.ఎంలు దేవి, వీణ, ఉపాధ్యాయులు గాజుల వెంక టేష్, చందన, సంగిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ముందు చేతులను శుభ్రంగా కడుగుతున్నారా ? లేదా అని తెలుసుకున్నారు. పాఠశాలలో ఎవరైనా అనారోగ్యంతో బాధ పడుతున్నారా ? అని ప్రశ్నించగా, కేవలం ఒక విద్యార్థిని మాత్రమే చిన్నపాటి రుగ్మతతో ఉందని, ప్రస్తుతానికి బాగానే ఉందని ఏ ఎన్ ఎం తెలిపారు. పాఠశాలలో సిక్ రూమ్ ఉందా అని కలెక్టర్ ఆరా తీశారు. ప్రస్తుత సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, పాఠశాల, పరిసరాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయించి, చుట్టూ దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని మున్సిపల్ అధికారిని ఆదేశించారు. పాఠశాల రెండు భవనాలలో మొత్తం ఎంతమంది విద్యార్థినులు ఉన్నారని కలెక్టర్ ప్రశ్నించగా ఒక భవనంలో 360, మరో భవనంలో 168 మంది విద్యార్థినులు ఉండి చదువుకుంటున్నారని ప్రిన్సిపల్ తెలపగా రోడ్డు అవతలి వైపు భవనంలో ఉన్న 168 మంది విద్యార్థినులను రేనివట్ల వెళ్ళే మార్గంలోని పాఠశాల భవనం ముందు ఉన్న మరో అద్దె భవనంలోకి మార్చాలని అప్పుడు రెండు భవనాలు ఎదురెదుగా ఉంటాయని, రెండు వేర్వేరు భవనాలలో ఉండి, అక్కడి నుం చి ఇక్కడికి విద్యార్థినులు వచ్చి వెళ్లి ఇబ్బందులు పడే కంటే ఒకే చోట ఉన్న వేర్వేరు భవనాలలో ఉండటం మంచిదని కలెక్టర్ తెలుపుతూ వీలైనంత త్వరగా కొత్త భవనంలోకి మార్చాలని ఆమె ఆదేశించారు.

## ఆరోగ్యవంతమైన బాల్యం కోసం నులిపురుగులను నిర్మూలిద్దాం

**తెలకపల్లి ఆగస్టు 11 ప్రభాతవార్త:** సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో 1 నుండి 19 ఏళ్ల వయసున్న 8745 మందికి గాను 7,562 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనం ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, సురక్షితమైన నీటిని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని, గోళ్ళను తరచూ కత్తిరించాలని, కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగిన తర్వాత ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ అలవాటు మూలంగా రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక మరియు మానసిక ఎదుగుదలలో అడ్డంకులు తొలగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వీర్ పాల్, ఏఎన్ఎంలు అలివేల, శాంత, పుష్ప, శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

**జాతీయ నులిపురుగుల దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ సంతోష్**

**గద్వాల టౌన్ ఆగస్టు 11, ప్రభాత వార్త:** నులిపురుగుల నివారణతో ఎన్నో ఆరోగ్య సమస్యలు పరిష్కారం అవుతాయని, ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఆల్బెండొజాల్ మాత్రలు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని గద్వాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నులిపురుగుల కారణాలవల్ల పిల్లల ఎదుగుదలలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయన్నారు. దీని నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 11వ తేదీన నేషనల్ డి వార్మింగ్ డే నిర్వహిస్తుందన్నారు. ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలందరికీ నొలిపురుగుల నివారణ కోసం ఆల్బెండజాల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ప్రభావితం చేసే నులిపురుగులను నివారించడానికి ఆల్బెండజోల్ మాత్ర తీసుకోవడం అవసరమన్నారు. విద్యార్థులు ఈ రోజు మాత్రలు వేసుకొని వారికి తిరిగి 18వ తేదీన మళ్లీ అందజేస్తారని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండ జాగ్రత్తలు వహించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తూ నిల్వ నీటిని తొలగిస్తూ డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలో అందరూ విధిగా యూనిఫాం ధరించాలనీ, అది కుల, మతాల భేదాలను తొలగించి సమానత్వాన్ని తీసుకువస్తుందని పేర్కొన్నారు. గత సంవత్సరం పదవ తరగతిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సర్టిఫికెట్లు, మిమెంటోలు అందజేసినట్లు గుర్తుచేస్తూ, ఈ సంవత్సరం కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించే వారికి గణతంత్ర దినోత్సవం వేడుకలలో ఘనంగా సన్మానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సిద్దప్ప, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ సంధ్య కిరణ్మయి, ప్రోగ్రామ్ ఆఫీసర్ రిజ్వాన, మెడికల్ ఆఫీసర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ జహురుద్దీన్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నులిపురుగుల మందులను పంపిణీ చేస్తున్న కలెక్టర్

## యూరియా పంపిణీలో అవకతవకలు సహించం : ఏడీఏ దామోదర్

**ఆత్మకూర్ ఆగస్టు 11, ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాకాలం సీజన్లో రైతులకు ఆత్మకూరు ఏరియా పరిధిలో యూరియా అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు యూరియా పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించబోమని వ్యవసాయ అడిషనల్ డైరెక్టర్ దామోదర్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం రోజు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆత్మకూర్ తాసిల్దార్ మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ తో కలిసి యూరియా పంపిణీ పై పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందుబాటులో యూరియా ఉంచేందుకు అన్ని ఆదేశాలు జారీ చేసిందని గుణంగానే రైతులకు అవసరమైన మేర యూరియా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం వరి నాట్లు పూర్తయిన నేపథ్యంలో అవసరమైన మేరకు మాత్రమే రైతులు యూరియా కొనుగోలు చేయాలని తదుపరి 15 రోజుల తర్వాత రైతులకు అవసరమైనంత యూరియా పంపిణీ చేసేందుకు తాము అన్ని చర్యలు తీసుకుంటున్నామని యూరియా కొరత మూలంగా రైతులు ఒకేసారి వ్యవసాయ సహకార సంఘాలకు ఎగబాకడం సరికాదన్నారు. ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న ఆగ్రోస్ సేవా పథకం మరియు ఇతర వ్యవసాయ డీలర్లు యూరియాను అధిక ధరకు విక్రయించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన అధికారులు సైతం ఎప్పటికప్పుడు డీలర్ల పై పర్యవేక్షణ కొనసాగిస్తూ స్టాక్ రిజిస్టర్లు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ పిఎసిఎస్ సెక్రటరీ నరేష్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులోని ప్రాథమిక సహకార సంఘంలో యూరియా నిలువలను తనిఖీ చేస్తున్న ఏడీఏ దామోదర్

## ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

**వెంకటయ్య ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.. (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్..**

**వనపర్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పరిధిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ అనుబంధ ఆత్మకూర్, ఖిల్లా గణపూర్ విపన గండ్ల, రేవల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించండని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చస్తూ సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో డిసిహెచ్ఎస్ డా. చైతన్య గౌడ్‌కి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ టీవీవిపి పరిధిలో నడుస్తున్న ప్రభుత్వ జిల్లా, ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రుల పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే కార్మికుల జీవనం సాగేది ఎలా అని ప్రశ్నించారు. యూనియన్ నేతృత్వంలో పెండింగ్ వేతనాలపై రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వివిధ రూపాల ఆందోళనలు నిరసనల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం గత 20 రోజుల క్రితం మూడు నెలలకు సంబంధించిన కార్మికుల వేతన బడ్జెట్ ని విడుదల చేసిందని అయినా ఇప్పటివరకు కార్మికులకు విడుదలైన వేతనాలు కూడా చెల్లించకుండా సంబంధిత వెంకటయ్య ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వెంకటయ్య ఏజెన్సీ నిర్వాహకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిగతా పెండింగ్ వేతన బడ్జెట్ ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కార్మికులకు ప్రతినెల విధిగా వేతనాల అందించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. డిసిహెచ్ఎస్ డా. చైతన్య గౌడ్ మాట్లాడుతూ మూడు రోజుల్లో కార్మికులకు వేతన అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చిన మూడు నెలల వేతన బడ్జెట్ బిల్లులు చెల్లించామని అన్నారు. వెంకటయ్య సర్వీసెస్ ఏజెన్సీ కాంట్రాక్టర్ పై యూనియన్ నాయకులు కార్మికుల అందజేసిన ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నామని జిల్లా కలెక్టర్ విచారణ రిపోర్టు అందజేసి చర్య తీసుకుంటామని ఆయన స్పందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సామాజిక ఆరోగ్య కేంద్రాల కార్మికులు పాల్గొన్నారు.


డా. చైతన్య గౌడ్ కు వినతి పత్రం అందజేస్తున్న (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఆగష్టు 15న జిల్లాలో నిర్వహించబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు ఏర్పాట్లపై బాధ్యతలను అప్పగించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున బందోబస్తు, ఫ్లాగ్ మార్చ్ ఏర్పాట్లు జిల్లా పోలీస్ శాఖ చూసుకోవాలని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, ప్రోటోకాల్, ముఖ్య అతిథులకు ఆహ్వానం బాధ్యతలను ఆర్డీవో కు అప్పగించారు. బారికేడింగ్, సౌండ్ సిస్టం, వేదిక ఏర్పాట్లను రోడ్లు భవనాల శాఖకు అప్పగించారు. ముఖ్య అతిథి ద్వారా ప్రజలకు ఇచ్చే సందేశానికి సంబంధించి వివరాలను స్పీచ్ కాపీ రూపొందించేందుకు సిపిఓ కు బాధ్యతలను అప్పగించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వేడుకలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ కీమ్యా నాయక్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్


సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

## భోజనం క్యాంటీన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే


భోజనం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాలటౌన్ ఆగస్టు 11, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో వున్న 5రూపాయలు భోజనం క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం కోసం వచ్చిన వారికి ఎమ్మెల్యే అన్నం వడ్డించారు. భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతూ భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకొన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని క్యాంటీన్ నిర్వాహకులకు ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ , మాజీ కౌన్సిలర్స్ శ్రీను ముదిరాజ్, షుకుర్ నాయకులు నాగేంద్ర యాదవ్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న డిండి చింతపల్లి బ్రిడ్జి


డిండి చింతపల్లి బ్రిడ్జి దెబ్బతిన్న రక్షణ కవచం

**ఉప్పునుంతల, ఆగస్టు11 ప్రభాతవార్త:** మండలంలోని తిరుమలాపూర్‌శివారులో ఉన్న డిండి చింతపల్లి బ్రిడ్జి దెబ్బతింది. బ్రిడ్జికి ఇరువైపులా నిర్మాణంచేపట్టిన రక్షణ కవచం విరిగిపోవడంతో ప్రమాదం అంచున రక్షణ కవచం ఒరిగి ఉంది. ఆర్అండ్‌బి శాఖ అధికారులు చొరవతీసుకొని వెంటనే రక్షణకవచం దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈప్రాంతంలో వర్షాలు పడిన సమయంలో అధిక సంఖ్యలో చేపలు పట్టడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి రక్షణ కవచంపై నిలబడి వేటాడుతుండడంతో దెబ్బ తిన్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన ముస్లిం మహిళలు

**చిన్న చింతకుంట, ఆగస్టు 11 ప్రభాతవార్త :** రాఖీ పండుగ అంటేనే అనుబంధాలు, ఆత్మీయతలకు ప్రతీకగా నిలుస్తుంది. కుల మతాలకతీతంగా రాఖీ పండుగను జరుపుకోవడం చూస్తుంటాం. సోమవారం దమగ్నాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికి మండల కేంద్రానికి చెందిన ముస్లిం మహిళలు ఫాతిమా బేగం, పడాన బేగం, రేష్మ బేగం లు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు రక్షగా ఉంటానని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.

## సీసీ కుంట ఏపీఎంగా నాగమణి

**చిన్నచింతకుంట, ఆగస్టు 11 ప్రభాతవార్త :** చిన్న చింతకుంట ఏపిఎంగా నాగమణి పదవీ బాధ్యతలను చేపట్టారు. గతంలో ఏపీఎంగా విధులు నిర్వహించిన విష్ణు చారి రేవల్లి మండలం ఏపీఎంగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పెద్దమందడి మండల ఏపీఎంగా విధులను నిర్వహిస్తూ బదిలీపై సీసీ కుంట మండల ఏపిఎంగా రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక సంఘాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.



# జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ పంపిణీ

- జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో విస్తృత కార్యక్రమం
- నులి పురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం
- ఆరోగ్య పరిరక్షణకు ఆల్బెండజోల్ మాత్రలు
- విద్యార్థినీ విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించే సూక్ష్మజీవులు (పరాన్న జీవులు) నులి పురుగులను నిర్మూలించడం అత్యంత ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలుర కళాశాలలో సోమవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత నివారణకు నులిపురుగుల నివారణ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, జిల్లావ్యాప్తంగా చిన్నారులు, విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు నేడు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేగుల్లో ఏర్పడే నులిపురుగుల వల్ల పిల్లల ఎదుగుదల మందగించడం, నీరసం, రక్తహీనత, చదువులో ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలతో బాధపడతారని, వీటని నివారించేందుకు ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. 1 నుంచి 19 సం॥లు వయస్సు 2,03,259 పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలు వేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రవేట్ పాఠశాలలు మరియు కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అపరిశుభ్రత వల్లే నులిపురుగులు సంక్రమిస్తాయని చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలని పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలని విద్యార్థులకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. పిల్లల పొట్టల్లో నులి పురుగులు చేరితే రక్తహీనత, ఆకలి మందగించడం, విరోచనాలు, బరువు తగ్గడం సమస్యలు లాంటివి ఎదురవుతాయని, వీటిని నివారించేందుకు ఏడాది నుండి 19 సంవత్సరాల వరకు పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలను వైద్యుల సూచన మేరకు వేసుకోవాలని కలెక్టర్ అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాలలో వంటశాల, నిత్యావసర వస్తువులు కూరగాయ, నిల్వలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆహార, వసతి విద్య తదితర అంశాల పట్ల కలెక్టర్ విద్యార్థులతో ఆరా తీశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా బియ్యం, ఇతర వస్తువులు భద్రపరచడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ తారా సింగ్, గురుకుల పాఠశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


సోషల్ వెల్ఫేర్ గురుకులంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## పిల్లిగుండ్ల కాలనీలో అధికారులు పర్యటించాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సామాజిక ఉద్యమకారుడు డా. ప్రేమ్ కుమార్

**ఇటిక్యాల, ఆగస్టు 11 ప్రభాతవార్త :** పిల్లిగుండ్ల కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని రహదారి పాడే పోయిందని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న కారణముగా రోడ్డు అస్తవ్యస్తంగా మారిందని కాలనీ విద్యార్థులు చదువు కునేందుకు గద్వాల పట్టణంలోకి రావాలన్న చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంతేకాక రోడ్డు, విద్యుత్ సరఫరా, మంచి నీటి సరఫరా సరిగా లేనందువల్ల వారి జీవనం దుర్భరంగా మారిందని అక్కడ ఉన్న విద్యార్థులు చదువు మధ్యలో ఆపేసి పరిస్థితి వస్తుందని రవాణా సౌకర్యం సరిగా లేనందువల్ల గద్వాల్ పట్టణంలో కోట బురుజు కూడా శిథిలావస్థలో ఉన్నందున అక్కడ జిల్లాఅధికార యంత్రాంగం పర్యటించి ప్రజలకు పునరావాసం కల్పించవాల్సిందిగా కోరుతూ సోమవారం సామాజిక ఉద్యమకారుడు డా. ప్రేమ్‌కుమార్ ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.

## కిరాణం అండ్ జనరల్ స్టోర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**దేవరకద్ర, ఆగస్టు 11 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలో కౌకుంట్ల మండలానికి చెందిన వలకొండ నాగయ్య గుప్తా కిరాణం అండ్ జనరల్ స్టోర్ ను, ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా సోమవారం రోజు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ముందుగా దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డికి వలకొండ నాగయ్య గుప్తా కుటుంబ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి, స్వాగతం పలికారు. పూజా అనంతరం కిరాణం అండ్ జనరల్ స్టోర్ ను ప్రారంభించి, నాగయ్య గుప్తాకు శుభాకాంక్షలు తెలిపిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన కిరాణం జనరల్ స్టోర్ మంచి లావాదేవీలు జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలకొండ జగదీష్, వలకొండ వెంకటేష్, వలకొండ వీరేష్, పవన్, అరుణ్, ధనలక్ష్మి, నాగమణి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, దేవరకద్ర మండలం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో విద్య, వైద్యానికి పెద్దపీట

**-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి**



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డిని సన్మానిస్తున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్

**భూత్పూర్, ఆగస్టు 11,ప్రభాతవార్త :** కాంగ్రెస్ హయాంలో విద్య,వైద్యానికి పెద్దపీట వేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి స్పష్టం చేశారు.సోమవారం మల్లు భూత్పూర్ శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు మనిషి మనోవికాసానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.చైర్మన్‌గా భూత్పూర్ గ్రంథాలయానికి వచ్చిన మల్లు నర్సింహ్మారెడ్డిని భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సత్కరించారు.గ్రంథాలయ భవనానికి ఫ్లోరింగ్,కాంపౌండ్ వాల్,టాయిలెట్ల నిర్మాణాలను ఏర్పాటు చేయాలని చైర్మన్ మల్లుకు నవీన్‌గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, శాఖా గ్రంథాలయ సహాయకురాలు మాధవి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

**దేవరకద్ర,ఆగస్టు11 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్న ప్రసాద దాతలు శ్రీ మంతన్ గౌడ్ ప్రభాకర్ సుధారాణి దంపతులు దేవరకద్ర వారు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని దానిని సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు. ప్రతి సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించేది ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు నాగరాజుస్వామి ఉన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల సరుకుల టెండర్లు పాత విధానంలోనే కొనసాగించాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన టెండర్ దారులు

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** 2025,2026 విద్య సంవత్సరానికి కూరగాయలు, కోడిగుడ్లు మటన్ ప్రొవిజన్స్ సరఫరాలో పాత విధానంలోనే కొనసాగించాలని, ప్రభుత్వం కొత్త విధానం అనుసరిస్తుండడంతో సోమవారం టెండర్ దారులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గురుకులలో కష్ట నష్టాలకు ఓర్చుకొని అన్ని రకాల సరుకులు అందజేశామని తెలిపారు. ఇప్పటికి ఇంకా నాలుగు నెలల నుండి మాకు ఎటువంటి బిల్లులు ప్రభుత్వం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త టెండర్లో సరికొత్త నియామలు పెట్టి మమ్మల్ని తప్పించాలని ప్రభుత్వం చూస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త టెండర్ విధానం మార్చుట, టెండర్లో అధిక ఈ యం డి మార్చుట, పాత టెండర్‌విధానం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 4గంటల నుండి కాకుండా 6 గంటల వరకు యధావిధిగా గత సంవత్సరం విధంగానే సరుకులు తీసుకునే విదంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొత్త టెండర్లో కోడిగుడ్ల టెండర్ మార్చి పాట టెండర్ విధానం కొనసాగించాలని కోరారు. పాత టెండర్ విధానాన్ని అనుసరించే వరకు నేటి నుండి అన్ని గురుకులాలలో కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్, ప్రొవిజన్స్, క్యాటరింగ్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెండర్‌దారులు రామాంజనేయులు, చందు తదితరులు పాల్గొన్నారు.

## అక్కి వెంకటమ్మ జ్ఞాపకార్థంగా చీరల పంపిణీ

**పెబ్బేరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణానికి చెందిన అక్కి వెంకటమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు జిల్లా బ్రాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ సోమవారం వాళ్ళ తల్లి 7వ వర్ధంతి సందర్భంగా 9వ, 10వ వార్డుకు చెందిన బీద మహిళలకు చీరలు అందజేయడం జరిగింది. అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఎన్ని జన్మలెత్తిన అమ్మ రుణం తీర్చుకోలేనిదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అక్కి సుశీల శ్రీనివాస్ గౌడ్, నాయకులు మిన బాబు గౌడ్,సత్యం, రజక నరసింహ, తిమ్మన్నగారి రాములు, భగత్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## డ్రగ్స్, గంజాయి,మద్యపానం పదార్థాల నిర్మూలనకై ర్యాలీ

**నారాయణపేట టౌన్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** డ్రగ్స్ గంజాయి మత్తు మద్యపానం పదార్థాల నిర్మూలనకై పీవైఎల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రగతి శీల యువజన సంఘం పీవై ఎల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని నారాయణపేట అంబేద్కర్ చౌరస్తా నుండి నర్సి రెడ్డి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి.రామకృష్ణ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రతాప్‌లు మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి మత్తు ఉచ్చులో వేళ్ళబోకు నీ భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాలన్నారు. యువతా మేలుకో డ్రగ్స్, గంజాయి, మద్యం, గుట్కాలు మనకు వద్దు దూరంగా ఉండు ఆరోగ్యానికి దగ్గరగా ఉందాం అన్నారు. యువతకు పిలుపు ఇస్తూ అలాగే యువతకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చెడు వ్యసనాలు డ్రగ్స్, గంజాయి, మద్యం మత్తు పదార్థాలు సేవిస్తూ జీవితాలను, కుటుంబాలను కోల్పోతున్నారన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యం గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ఏరులై పారుతున్నాయి. డ్రగ్స్, గంజాయిలు, మద్యం మత్తులో పడి యువత అత్యాచారాలకు, దొంగతనాలకు ఒడిగడుతున్నారు. ఈ కార్యక్రమంలో పీవై ఎల్ జిల్లా నాయకులు మధు,మహేష్, బాలకృష్ణ, తిరుమలేష్. శివ, ఎల్లప్ప. గణేష్,బోయ రవి, బాలకృష్ణ, సలీం, కృష్ణ, గణేష్, రాము, టౌన్ కార్యదర్శి కెంచ్ నారాయణ, హాజీ, నారాయణ, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

## బారంబావి నీటితో ఔదుంబర్ శివుడికి జలాభిషేకం

**నారాయణపేట టౌన్, ఆగస్టు11 ప్రభాతవార్త:** శ్రావణ మాసాన్ని పురస్క రించుకొని నారాయణపేట పట్టణం 16 వ వార్డుకి చెందిన శివ భక్తులు బారంబావి నీటితో పాదయాత్రగా వెళ్ళి ఔదుంబర్‌లో కొలువైన శివలింగానికి జలాభిషేకం చేశారు. అనాదిగా కొనసాగుతున్న ఈ ఆచారాన్ని నేటికి పాటిస్తున్న భక్తులను పేట ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ రాంపురం శివారెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవ రెడ్డి, మాజీ ఏఎంసి ఛైర్మన్ సరాఫ్ నాగరాజు, శివ భక్తులు పాల్గొన్నారు.

# రైతన్న శ్రేయస్సే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- కాలువను తెంచినట్లయితే జైలుకు పంపిస్తాం : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- గండిపడిన కేఎల్ఐ కాల్వను పరిశీలించిన ఎమ్మెల్యే



తెగిన కేఎల్ఐ కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**వెల్దండ, ఆగస్టు11 ప్రభాతవార్త:** రైతన్న సంక్షేమం వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్ర సమీపంలోని లచ్చపురం దగ్గర తెగిన కేఎల్ఐ కాల్వను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు సాగు నీరు ఇచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని, కొందరు దుర్బుద్ధితో కాలువను తెంపుతున్నారని ఇక్కడ ఉండే రైతులే చెప్పున్నారని, ఎవరైనా కాలువను తెంచే ప్రయత్నాలు చేస్తే ఎంతటి వారినైనా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఇరిగేషన్ సిబ్బంది,లష్కర్లు, పోలీసులు ఎప్పటికప్పుడు కాలువలను పరిశీలిస్తుండాలని, ఇప్పటికే ఎస్పీతో మాట్లాడడం జరిగిందని, ప్రజాధనాన్ని ఎవరైనా వృథా చేస్తే వారిని జైలు పంపించడానికి అయినా సిద్ధమన్నారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ముందున్న లక్ష్యమని, 30 వేల ఎకరాలకు సాగునీరు పారుతుందని గండిపడిన కేఎల్ఐ కాలువ పూడ్చడానికి మరో 5 రోజుల సమయం పడుతుందని, ఇప్పుడు బిఆర్ఎస్ నాయకులు కాలువలు నాసిరకంగా ఉన్నాయని అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వంలోని కాలువలను నిర్మించడం జరిగిందని, నాసిరకానికి వారే సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదునాం చేయడానికి ప్రయత్నిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిబి మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, ఇరిగేషన్ ఎస్సీ పార్థసారథి, ఈఈ శ్రీకాంత్, డిఈ దేవన్న, మాజీ సర్పంచ్‌లు యెన్నం భూపతిరెడ్డి, బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీవిజయ్ కుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, రమాకాంత్‌రెడ్డి, కేశమల్ల కృష్ణ,అలీ,రషీద్,శంకర్‌నాయక్,హరికిషన్, నారాయణ, వెంకటేష్, ఎర్ర శ్రీను ముదిరాజ్, భరత్ గౌడ్, బాబా తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు ప్రతి ఏటా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే

**దేవరకద్ర, ఆగస్టు11 ప్రభాతవార్త:** బాల బాలికల్లో నూలి పురుగుల సమస్య నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి ఏటా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్‌రెడ్డి అన్నారు. నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ఆల్బెండజోల్ టాబ్లెట్ పంపిణీ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా రెండుసార్లు ఫిబ్రవరి, ఆగస్టు, మాసాలలో ఆరు నెలలకోసారి అన్ని రాష్ట్రాలలో డివార్మింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తూ, ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు పిల్లలందరికీ నులి పురుగుల నిర్మూలన మాత్రలు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయడం జరుగుతుందన్నారు. దేశంలోని ఏ ప్రాంతంలో పిల్లలు నివసిస్తున్న, వారి పరిస్థితులు ఎలా ఉన్నా ప్రభుత్వం వారి శ్రేయస్సుకే ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. తల్లి మరియు బిడ్డను ఆరోగ్యంగా మార్చడానికి మరియు వారికి సకాలంలో ఆరోగ్య సంరక్షణ లభించేలా మేము శ్రద్ధ వహిస్తాము. పాఠశాలలోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందించనున్నమని దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శరత్ చంద్ర, ఎంపీడీవో శ్రీనివాసరావు, తాహసిల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ ఈవో సీతా నాయక్, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, గోపన్ పల్లి సురేందర్ రెడ్డి, గద్దె గూడెం పూర్ణిత,గోపాల్, చంద్రమౌళి, ముచ్చింతల వెంకటేశ్వర్ రెడ్డి, వీరప్పయ్య,చైర్మన్ బీషునరసింహారెడ్డి,మాజీ సర్పంచ్ ఉషన్నప్ప, వివిధ ముఖ్య నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ



ఆత్మకూరులోని పిఎసిఎస్ కార్యాలయంలో పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ ఆగస్టు11, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో సోమవారం రోజు యూరియా కోసం రైతులు ఒక్కసారిగా ఎగబాకడంతో పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. ఆత్మకూర్ ప్రాథమిక సహకార సంఘానికి యూరియా వచ్చిందన్న విషయాన్ని తెలుసుకున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున తరలిరావడంతో యూరియా పంపిణీలో తోపులాట జరిగింది. యూరియా పంపిణీ సమయంలో రైతుల తోపులాట చోటు చేసుకోవడంతో ఆత్మకూర్ పిఎసిఎస్ సెక్రటరీ నరేష్ ఆత్మకూర్ పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్ఐ నరేందర్ పోలీసు బందోబస్తును తరలించి యూరియా పంపిణీ కోసం చర్యలు చేపట్టారు. ఓవైపు సోమవారం రోజు ఆత్మకూర్ ప్రాథమిక సహకార సంఘాన్ని వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ దామోదర్ సందర్శించి యూరియా పంపిణీని పర్యవేక్షించడం ఏ కాకుండా రైతులకు అందుబాటులో యూరియా ఉందని చెప్పడంమరోవైపు అదే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా కోసం రైతులు తోపులాట చేసుకోవడం పట్ల పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అధికారుల చేస్తున్న ప్రకటనలకు యూరియా పంపిణీ చేస్తున్న విషయానికి ఏమాత్రం పొంతన కుదరకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి నాట్లు వేసి నెల రోజులు పూర్తికావస్తున్న నేపథ్యంలో యూరియా కోసం రైతులు పడరాని పాటుపడుతున్నారు. ఒక్కో యూరియా బస్తా 270 రూపాయలకు మాత్రమే విక్రయించాల్సి ఉండగా ఆత్మకూరులోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువల డీలర్లు ఇది అదునుగా భావించి రైతులకు ఒక్కో వస్తాను 350 రూపాయల మేర విక్రయిస్తున్నాం పట్ల రైతులు బహిరంగంగానే విమర్శల వర్షంగుప్పిస్తున్నారు. అధికారులు చేస్తున్న ప్రకటనలకు యూరియా పంపిణీ చేస్తున్న విషయానికి ఏమాత్రం పొందడం లేకపోవడంతో జిల్లా కలెక్టర్ ఈ విషయంపై స్పందించి రైతులకు అందుబాటులో యూరియా అందించే విధంగా తక్షణమే చర్యలు చేపట్టాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. యూరియాపంపిణీలో రైతుల తోపులాట చేసుకుం టున్నా విషయంపై ఆత్మకూర్ పిఎస్సిఎస్ సెక్రటరీ నరేష్ను ప్రభాతవార్త వివరణ కోరగా సోమవారంరోజు 450బస్తాలు యూరియా తరలిరావడంతో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పునపంపిణీ చేశామని మంగళవారం కూడా సహకార సంఘా నికి యూరియా రానున్న నేపథ్యంలో రైతులకు అందుబాటులోనే యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని బదిలీ ఇవ్వడం విశేషం.

## ప్రజావాణికి 22 ఫిర్యాదులు

- ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో కలిసి అదనపు కలెక్టర్లు, అమరేందర్, దేవ సహాయం, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణికి మొత్తం 22 ఫిర్యాదులు వచ్చాయని, ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగా సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**ఉప్పునుంతల, ఆగష్టు11 ప్రభాతవార్త:** మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం ఘనంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ ను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి గ్రామదేవతలకు బోనం సమర్పించారు. గ్రామంలోని యువకులు, గ్రామస్తులు,మహిళలు అమ్మవారు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.



మామిళ్ల పల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు11 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 22 దరఖాస్తులు ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కలెక్టర్ సిక్త పట్నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎస్. శ్రీనుకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీలు అందజేత

**దామరగిద్ద,ఆగస్టు 11 ప్రభాతవార్త:** దామర్ గిద్ద మండలం కాత్యన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏసీడీపీఓ వెంకటమ్మ జన్మదినం సందర్భంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు డిక్షనరీలు, ప్యాడులు, స్కుల్ బ్యాగ్‌లు పంపిణీ చేయడం జరిగింది. వెంకటమ్మ మాట్లాడుతు ప్రతి ఒక్కరు ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలి మంచి చదువులు చదువుకోని మీతల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలి. మీరు ఒక లక్ష్యం ఎర్పర్చుకోని ప్రతి నిత్యం కృషి చేయలిఅన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సత్య నారాయణ, ఏసీడీపీఓ వెంకటమ్మ, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి, బేటి బచావో బేటి పడావో కో అర్డినేటర్ నరసింహా, జెండర్ స్పెషలిస్ట్ అనిత, నరసింహా, నితి అయోగ్ నరేష్, పాఠశాలఉపాధ్యాయ బృందం,విధ్యార్థులు పాల్గోన్నారు.

## నులిపురుగుల మాత్రల పంపిణీ

**ఊట్కూర్, ఆగస్టు11 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పిల్లల్లో నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, ఎదుగుదల లోపంత ఇతర ఆరోగ్య సమస్యలను నివారించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం అని ఆరోగ్య అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధనుంజయగౌడ్, వైద్యాధికారి సంతోషి, ఏఎన్ఎం గోవిందమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు పంపిణీ చేయడం వల్ల నులిపురుగుల సమస్య గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. 2 సంవత్సరాల లోపు పిల్లలకు మాత్రలు ఇవ్వకూడదని, తల్లిదండ్రుల సమక్షంలోనే మాత్రలు తీసుకోవాలని సూచించారు.

**పెబ్బేరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపల్ పట్టణ పరిధిలోనీ కస్తూర్బా బాలికల విద్యాలయంలో జాతీయ నులి పురుగుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు జిల్లా వ్యాధి నిరోధకాల అధికారి డా. పరిమళ ఆల్బెండా జోల్ టాబ్లెట్లు వేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యఅధికారి డాక్టర్ ప్రవళిక, పల్లె దవాఖాన డాక్టర్ సుధారాణి, వ్యాక్సిన్ అధికారి పరశురామ్, ప్రిన్సిపాల్ పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇటిక్యాల, ఆగస్టు11 ప్రభాతవార్త:** జాతీయనులి పురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు నులిపురుగుల నిర్మూలనకు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. ఉమ్మడి మండలంలోని 29 గ్రామపంచాయతీలలో వైద్య శాఖ సిబ్బంది ఏఎన్ఎమ్ లు. ఆశా కార్యకర్తలు. అంగన్వాడి టీచర్ల నేతృత్వంలో అంగన్వాడి కేంద్రాలు. పాఠశాలలు. కళాశాలలో పిల్లలకు భోజనం తిన్న తర్వాత ఆల్బెండజోల్ మాత్రాల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. అందులో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఎస్వీఆర్ ప్రవేట్ పాఠశాలలో డా. రాధిక, ఆర్.బి.ఎస్.కె డా.రాఘవేంద్ర. ఏఎన్ఎం ఎలిజబెత్. ఆశా కార్యకర్తతో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను తినిపించారు. అలాగే ఈరోజు తప్పిపోయిన పిల్లలకు ఈనెల 18వ తేదీ సోమవారం మాప్ ఆప్‌డే రోజు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రాలను పంపిణీ చేయనున్నారు. పంపిణీ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాలలో కళాశాలలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**భూత్పూర్,ఆగస్టు 11,ప్రభాతవార్త:** పిల్లల్లో నులిపురుగుల నివారణలో భాగంగా భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని సారిక టౌన్‌షిప్ రాజీవ్‌స్వగృహలోని ఎంజెపి బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో భూత్పూర్ పీహెచ్‌సీ వైద్యులు,ఉద్యోగులు,సిబ్బంధి బాలబాలికలకు అల్‌ఫెండాజోల్ మాత్రల్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్,డాక్టర్ రాధిక,హెచ్ఎ శ్రీనివాస్‌తో పాటు గురుకుల ప్రిన్సిపాల్ సుగుణశ్రీ ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**మాగనూర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవన్ని పురస్కరించుకొని మాగనూర్ మండల కేంద్రంలో ఉన్న అన్ని పాఠశాలలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం నులిపురుగుల మాత్ర పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అప్రోచ్, ఎంఈఓ మురళీధర్ రెడ్డి, వైద్య సిబ్బంది నాగజ్యోతి, తేజస్విని,సుధా, సరిత, కృష్ణవేణి,రేణుక తదితరులు పాల్గొన్నారు.

**మద్దూర్, ఆగస్టు11 ప్రభాతవార్త:** సోమవారం మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. శ్రీలత ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు,అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు,ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల ఉత్సవం సంబరంగా జరుపుకొందాం

**- మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్**

**జడ్చర్ల, ఆగస్టు 11,ప్రభాతవార్త:** బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల వందేళ్ల ఉత్సవాన్ని సంబరంగా జరుపుకుందామని మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం జడ్చర్లలోని ఆయన నివాసంలో బాదేపల్లి హైస్కూల్ శతాబ్ద ఉత్సవ కమిటీ కలుసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన హైస్కూల్ శత సంబరాలు జరుపుకోవడం అదృష్టం అన్నారు. హై స్కూల్లో చదివిన వారితో పాటు నియోజకవర్గ ప్రజలందరూ ఉత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎర్రశేఖర్‌ను కలిసిన వారిలో ఎంఈఓ మంజులాదేవి, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉత్సవ కమిటీ సభ్యులు బాద్మి రవిశంకర్, కృష్ణ, పెద్దిబాలకృష్ణ, జీనురాల సత్యం, పరమటయ్య, సంతోషాచారి తదితరులు ఉన్నారు.

## రేపు ఎంవీఎస్‌లో జాబ్ మేళా

**- ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మావతి వెల్లడి**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 11,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లి వద్ద ఉన్న ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస ఫౌండేషన్, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 13న బుధవారం కళాశాలలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యులు ప్రొఫెసర్ కె. పద్మావతి తెలిపారు. ప్రధాన ఎమ్.ఎన్.సి కంపెనీలు, బ్యాంకుల హెచ్‌ఆర్‌లు అభ్యర్థులకు ఇంటర్వ్యూ ద్వారా సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు. మహబూబ్నగర్ ఇతర జిల్లాల నుండి కూడా నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చు అని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.25 వేల రూవరకు వేతనం ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రధానాచార్యులు వివరిస్తూ అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు తమ బయోడేటా తో పాటు పది, ఇంటర్, డిగ్రీ, ఆధార్ కార్డు, జిరాక్స్‌తో పాటు పాస్పోర్ట్ సైజు ఫొటోతో రావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల తమ బయోడేటా ఐదు సెట్లను సమర్పించాల్సి ఉంటుందన్నారు.

## విద్యార్థులకు అవగాహన

**జడ్చర్ల, ఆగస్టు11,ప్రభాతవార్త:** డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల టి.ఎస్. కే.సి.వారిఆధ్వర్యంలో కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థినీ విద్యార్థులకు డీట్ డిజిటల్ ఎంప్లా య్మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి సుకన్య నేతృత్వంలో ఏర్పాటు చేశారు. విద్యార్థి దశలో సామర్థ్యాల ఆధారంగా వారికి నచ్చినటు వంటి ఉపాధి అవకాశాలను ఎంపిక చేసుకోవడానికి ఈ సదుపాయం ఎంతగానో ఉపకరిస్తుందని,విద్యార్థులందరూ దీనిని తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమానికి అకాడమిక్ కోఆర్డినేటర్ రాఘవేందర్ రెడ్డి, టిఎస్ కే సి కోఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మి, టిఎస్‌కేసి మెంటర్ వీరప్రతాప్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అడ్మిషన్ కొరకు లక్కీ డీప్

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** 202526 విద్యా సం.။గాను హైదారాబాద్ పబ్లిక్ స్కూల్ అడ్మిషన్ కొరకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించగా నారాయణపేట జిల్లా నుండి ఆరు మంది దరఖాస్తు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించి ఒక విద్యార్థిని ఎంపిక చేయడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధిఖారి కజ్జం ఉమాపతి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద రాజులు, డిసిఓ యాదమ్మ, సీనియర్ సహాయకులు పూజారి నర్సింహులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

